క్లుప్తంగా

ఇసుక తరలింపును అరికట్టాలని ఫిర్యాదు



పంచాయతీ సిబ్బందికి ఫిర్యాదు చేస్తున్న వడ్డాది గ్రామస్తులు

బుచ్చెయ్యపేట: వడ్డాది మేజర్ పంచాయతీలోని పెద్దేరు నది నుంచి ఇసుక అక్రమ తరలింపును అరికట్టాలని గ్రామస్తులు పంచాయతీ ఈవోకు శనివారం ఫిర్యాదు చేశారు. ఇక్కడ ఎస్సీ కాలనీలో పెద్దేరు నది ఒడ్డున ప్రభుత్వ పాఠశాల, మంచినీటి ట్యాంక్ దగ్గరలో ఇసుక అక్రమ తవ్వకాలతో గోతులు ఏర్పడి వాటి ఉనికి ముప్పు వాటిల్లుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తుఫాన్ సంభవించినపుడు మంచినీటి ట్యాంక్, పాఠశాల కూలిపోయే ప్రమాదం ఉందని గ్రామస్తులు కె. గురుమూర్తి, ఎం.వి. రమణ, కె. యేసుదాసు, త్రినాథ్, ఎం. సాయికిరణ్, మామిడి శ్రీనివాస్ ఈవోకు ఫిర్యాదు చేశారు.

ఎన్‌సీసీకి 26 మంది విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం స్వర్ణలత

దేవరాపల్లి: ఏ. కొత్తపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి 26 మంది విద్యార్థులు ఎన్‌సీసీకి ఎంపికైనట్లు స్థానిక హెచ్‌ఎం వై. స్వర్ణలత తెలిపారు. స్థానిక హైస్కూల్‌లో ఎన్‌సీసీకి విద్యార్థుల ఎంపిక ప్రక్రియను శనివారం చేపట్టారు. పాఠశాలలోని 8, 9 తరగతుల విద్యాభ్యాసం చేస్తున్న 26 మంది బాల బాలికలు ఎన్‌సీసీకి ఎంపికయ్యారని ఆమె తెలిపారు. వీరంతా క్రమశిక్షణ, సేవా సత్పరత కలిగి సమాజానికి సేవ చేయాలని సూచించారు. ఎన్‌సీసీ విద్యార్థులకు ఉన్నత చదువుల్లోను, ప్రభుత్వ ఉద్యోగాల్లోను ప్రాధాన్యం కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్ డి. గాయిత్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్‌కు రూ.13 వేల అపరాధ రుసుం

బుచ్చెయ్యపేట: అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌పై కేసు నమోదు చేసి రూ.13 వేల అపరాధ రుసుం వసూలు చేసినట్లు ఎస్‌ఐ కుమారస్వామి శనివారం తెలిపారు. ఇసుక అక్రమ తరలింపుపై స్థానికుల సమాచారం మేరకు పి. భీమవరం వద్ద వాహనాలు తనిఖీ చేపట్టామన్నారు. వడ్డాది నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు.

సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన



రోడ్డు పనులు చేయిస్తున్న సర్పంచ్ రమేశ్

మాడుగుల రూరల్: శంకరం పంచాయతీ శివారు గ్రామాల్లో సీసీరోడ్డు పనులకు సర్పంచ్, వైఎస్సార్‌సీపీ ఎస్సీ, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు శోలం రమేశ్ శనివారం శంకుస్థాపన చేశారు. మునిపల్లి, రామచంద్రపురం, బొడ్డరేవు, కొత్తవలస, వెలగలపాడు, గొప్పూరు, రాజంపేట, రావిపాలెం గిరిజన గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణానికి డిప్యూటీ సీఎం బూడి చొరవతో రూ.40 లక్షలు మంజూరయ్యాయి. ఎంపీటీసీ తుర్రె సత్యవతి, ఉప సర్పంచ్ ఆగారి దేవి, సచివాలయ కన్వీనర్ ఉబ్బేటి రక్షకుడు పాల్గొన్నారు.

జనజాగృతి సభను విజయవంతం చేయండి



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయికులు

నర్సీపట్నం: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో వచ్చే నెల 7వ తేదీన విజయవాడలో జరిగే జనజాగృతి సభను విజయవంతం చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు యు.బ్రహ్మయ్య కోరారు. శనివారం నర్సీపట్నంలో ఆయన సభ పోస్టర్లను విడుదల చేశారు. జిల్లా కన్వీనర్ చిందాడ నూకేశ్వరరావు, ఎం.సతీష్, ఎం.దొరబాబు, సిహెచ్. సత్యనారాయణ పాల్గొన్నారు.

మట్టిలో మాణిక్యాలు గ్రామీణ విద్యార్థులు

ప్రతిభ చూపిన విద్యార్థులకు డిప్యూటీ సీఎం బూడి అభినందన



విద్యార్థులు రెడ్డి మౌళి, దమ్ము గణేష్‌లను అభినందిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: గ్రామీణ విద్యార్థులు మట్టిలో మాణిక్యాలని, జాతీయ, రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించడమే ఇందుకు నిదర్శనమని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. ఈ మేరకు ప్రతిభావంతులైన వేచలం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రెడ్డి మౌళి, దమ్ము గణేష్‌లను తారువ క్యాంప్ కార్యాలయంలో శనివారం ఆయన అభినందించారు. రెడ్డి మౌళి పదో తరగతి ఫలితాల్లో 584 మార్కులతో మాడుగుల నియోజకవర్గ స్థాయిలో అగ్రగామి నిలిచాడు. ఇదే పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి దమ్ము గణేష్ హైదరాబాద్‌కు చెందిన ఆర్మీ బేస్ బాయ్స్ స్పోర్ట్స్ ఇనిస్టిట్యూట్‌కు ఎంపికయ్యాడు. వీరిని శాలువాతో సత్కరించి అభినందించారు. మరింత ఉన్నత స్థానాలను అధిరోహించి ఈ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. వేచలం సర్పంచ్ నాగిరెడ్డి శతారినాయుడు, హెచ్‌ఎం దేవులపల్లి నర్సింహమూర్తి, పీడీ రావాడ తమ్మునాయుడు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ రెడ్డి శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేస్తాం

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ



గంధవరంలో మహిళతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

చోడవరం: ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందివ్వడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గంధవరంలో శనివారం ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యలపై ఆరా తీశారు. ఈ క్రమంలో వివిధ కారణాలతో పింఛన్లు రానివారు కొందరు తమ సమస్యను విన్నవించారు. త్వరలో వారికి పింఛన్లు మంజూరయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం నుంచి తాము పొందుతున్న పథకాలు, ఆర్థిక భరోసాపై మహిళలు, స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. స్థానిక సమస్యలను సర్పంచ్ పల్లా నర్సింగరావు ప్రభుత్వ విప్ దృష్టికి తెచ్చారు. అభివృద్ధి పనులకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, తహసీల్దార్ తిరుమలరావు, పంచాయతీరాజ్ డీఈఈ ప్రసాద్, ఎంపీటీసీల ఫ్లోర్ లీడర్ పల్లా సంతోష్‌రమణ, కోఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు మొల్లి చినఅప్పలనాయుడు, మాజీ సర్పంచ్ మొల్లి రామకృష్ణ, మాజీ ఎంపీటీసీ మొల్లి ప్రసాద్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



తైపురంలో మంచినీటి బోరును ప్రారంభిస్తున్న విప్ ధర్మశ్రీ

జగనన్న పాలనలోనే ఆర్థిక పురోభివృద్ధి

బుచ్చెయ్యపేట: ప్రజాసంకల్ప యాత్రలో ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చి మాటమీద నిలబడ్డ మొనగాడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా శనివారం రాత్రి తైపురం, చిట్టియ్యపాలెం గ్రామాల్లో ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గత టీడీపీ పాలన కంటే వైఎస్సార్‌సీపీ పాలన బాగుందని ఆయా గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. గతంలో చంద్రబాబు హామీలను నెరవేర్చకుండా ప్రజల్ని మోసగించాడని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం 98.5 శాతం నెరవేర్చి చరిత్రలోనే నిలిచిపోయారని విప్ ధర్మశ్రీ వివరించారు. రెండు గ్రామాల్లో ప్రజా సమస్యలను పరిష్కరిస్తామన్నారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, తైపురం సర్పంచ్ ముచ్చకర్ల శ్రీను, నాయకులు బుదిరెడ్డి భూషణం, కోరుకొండ అప్పలనాయుడు, బుదిరెడ్డి అప్పారావు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికెళ్లి 10 రకాల సమస్యల పరిష్కారం

మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి



మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి

కె.కోటపాడు: మండలంలో వచ్చే నెల ఒకటి నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వో, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని నెల రోజుల పాటు అన్ని సచివాలయాల్లో నిర్వహించాలన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి పది రకాల సమస్యలను గుర్తించి అర్హతను బట్టి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.శచీదేవి, తహసీల్దార్ జె.రమేష్‌బాబు పాల్గొన్నారు.

మాకవరపాలెం: సచివాలయాల ద్వారా అందించే సేవలను ప్రజలకు తెలియజేసేందుకు ఈ నెల 24 నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో అరుణశ్రీ తెలిపారు. ఆమె శనివారం మాట్లాడుతూ మండలంలో పది రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. రెండు టీంలు అన్ని సచివాలయాల్లోనూ ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థల ద్వారా అందిస్తున్న సేవలను తెలియజేస్తుందన్నారు.

నల్లకొండమ్మ తల్లి ఆలయానికి రూ.లక్ష విరాళం



ధర్మకర్త జోగిరాజుకు నగదు ఇస్తున్న దాత సంజుకుమార్

నాతవరం: తాండవ రిజర్వాయరు గట్టు దిగువనున్న నల్లకొండమ్మ తల్లి ఆలయం వద్ద తాగునీటి సౌకర్యార్థం దాత వి.సంజుకుమార్ రూ.లక్ష విరాళంగా ఇచ్చారు. తూర్పుగోదావరి జిల్లా మండపేటకు చెందిన ఆయన శనివారం ఇక్కడ అమ్మవారిని దర్శించుకున్నారు. వేసవిలో భక్తుల తాగునీటి ఇబ్బందులను గతంలో పరిశీలించిన నేపథ్యంలో ఆలయ ధర్మకర్త కూనిశెట్టి జోగిరాజుకు ఈ మొత్తం అందజేశారు. అమ్మవారి అనుగ్రహంతో తనవంతు సాయం చేశానన్నారు. ఆలయ కమిటీ ఆయన్ను ఘనంగా సత్కరించింది. కమిటీ సభ్యులు నంబారు బాబూరావు, మాజీ ఎంపీటీసీ శివలంకి మరిడేశ్వరరావు, మాధవనగరం గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వారం రోజుల్లో మెయిన్ రోడ్డు విస్తరణ ప్రారంభం

• నర్సీపట్నం ఎమ్మెల్యే గణేష్



అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: పట్టణంలోని మెయిన్ రోడ్డు వందడుగులకు విస్తరించాలని నిర్ణయం తీసుకున్నాం.. కొద్ది రోజుల్లో ఈ పనులు చేపడతామని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. ఆర్డీవో హెచ్.వి.జయరాం అధ్యక్షతన స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో మున్సిపల్, రెవెన్యూ, అర్ అండ్‌బీ, విద్యుత్ శాఖ, టౌన్‌ప్లానింగ్ అధికారులతో శనివారం ఆయన సమావేశమయ్యారు. రోడ్డు విస్తరణలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. రోజు రోజుకు పెరుగుతున్న పట్టణ జనాభాతోపాటు చుట్టుపక్కల మండలాల నుంచి వచ్చే వారితో మెయిన్ రోడ్డులో రద్దీ ఏర్పడి ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందన్నారు. ప్రజలు అవసరాల దృష్ట్యా మెయిన్ రోడ్డు విస్తరించాలని కౌన్సిల్‌లో నిర్ణయం తీసుకున్నామన్నారు. రూ.16 కోట్లతో అబీద్‌సెంటర్ నుంచి పెదబొడ్డేపల్లి మదుం వరకు, వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి పెదబొడ్డేపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ వరకు రోడ్డును విస్తరిస్తున్నామన్నారు. ఈ నెల 19న టెండర్ ప్రక్రియ పూర్తి కానుందన్నారు. దీనివల్ల 250 మందికి నష్టం వాటిల్లుతున్నా భవిష్యత్తు దృష్ట్యా తప్పదన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, మున్సిపల్ కమిషనర్ కనకారావు, విద్యుత్ శాఖ ఏడీ సత్యానందం పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

• మున్సిపల్ చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి

నర్సీపట్నం: విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి అన్నారు. పెదబొడ్డేపల్లి బాలుర గురుకుల పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను మరింత ప్రోత్సహించేందుకు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆణిముత్యాల కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. పదో తరగతిలో పాఠశాల స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహాన్ని అందజేశారు. వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, ప్రిన్సిపాల్ శివప్రసాద్, పార్టీ అధ్యక్షుడు ఏకా శివ, నాయకుడు యాదగిరి శేషు పాల్గొన్నారు.

ఈదురు గాలులకు విరిగిన చెట్లు

రావికమతం: మండలంలో శనివారం సాయంత్రం ఈదురు గాలులతో పాటు చిరుజల్లులు పడ్డాయి. ఈ గాలులకు పి.పొన్నవోలు, చీమలపాడు, కన్నంపేట, మర్రివలస, రావికమతం పొలాల్లో పలు చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ లైన్లపై పడ్డాయి. దీంతో ఎక్కడికక్కడ సరఫరా నిలిచిపోయింది. ట్రాన్స్‌కో సిబ్బంది పునరుద్ధరణ చర్యలు చేపడుతున్నారు.

'జగనన్నకు చెబుదాం' ఫిర్యాదులకు పరిష్కారం

బుచ్చెయ్యపేట: పలు గ్రామాల్లో అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందలేదని జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులపైన జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) శిరీషారాణి పరిష్కరించారు. శనివారం సాయంత్రం ఆమె బుచ్చెయ్యపేట, గున్నెంపూడి, కొండపాలెం తదితర గ్రామాల్లో పలువురిని కలిసి విచారించారు. ఆయా గ్రామాల్లో సచివాలయ భవనాలు, రైతు భరోసా, వెల్‌నెస్ సెంటర్లు, జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. అర్హత కలిగిన వారందరికీ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు పెంచాలని, నాణ్యమైన పౌష్టికాహారం, మధ్యాహ్న భోజనం అందేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఎంపీడీవో సువర్ణరాజు, మండల పంచాయతీ అధికారి విజయలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ హరీష్ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ జయమ్మ తదితరులు

చీడికాడ: పెదగోగాడ – వరహాపురం రహదారి పనులకు ఎంపీపీ కురచా జయమ్మ, జెడ్పీటీసీ లాలం శారదా జానకీరామ్ శనివారం భూమిపూజ చేసి ప్రారంభించారు. మూడు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి రూ.1.40 లక్షలు మంజూరు చేసిన డిప్యూటీ సీఎం బూడికి కృతజ్ఞతలు తెలిపారు. మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, వైస్ ఎంపీపీ ధర్మిశెట్టి స్వాతి కొండబాబు, యువజన విభాగం అధ్యక్షుడు గొల్లవిల్లి స్వామినాయుడు, పెదగోగాడ సర్పంచ్ పైలా అచ్చియ్యమ్మ, నాయకులు భూసాల కనకం, పైలా సత్యం, గోగాడ రాము, పైలా జగన్నాథం, పైలా నాయుడు, ఎలిశెట్టి నాగేష్ పాల్గొన్నారు.

జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ



రావికమతం: కిట్లను అందిస్తున్న ప్రజా ప్రతినిధులు



గొలుగొండ: మాట్లాడుతున్న ఎంపీపీ మణికుమారి

గొలుగొండ: ఇటీవల పదో తరగతి ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థినులను స్ఫూర్తిగా తీసుకుని బాగా చదువుకోవాలని ఎంపీపీ గజ్జలపు మణికుమారి సూచించారు. శనివారం స్థానిక కేజీబీవీలో విద్యార్థినులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. ప్రత్యేకాధికారి సుధ, వైస్ ఎంపీపీ సుర్ల బాబ్జి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రావికమతం: కొత్తకోట పెంటపాటి సూర్యారావు మెమోరియల్ హైస్కూల్, గుమ్మాళ్లపాడు పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను జెడ్పీటీసీ తలారి రమణమ్మ ఆదిమూర్తి పంపిణీ చేశారు. హైస్కూల్ కమిటీ చైర్మన్ అడ్డూరు నానాజి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ కోన లోవరాజు, గుమ్మాళ్లపాడు సర్పంచ్ బంటు సన్యాసినాయుడు, ఉప సర్పంచ్ పందల దేవా, ఎంపీటీసీ పూడి దేవా, నాయకులు బేతా పాండు, మహేష్, హెచ్‌ఎం నవర బ్రహ్మాజి పాల్గొన్నారు.

కె.కోటపాడు: విద్యా సంవత్సరం ప్రారంభం రోజునే జగనన్న విద్యా కానుక అందిస్తున్నామని వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ అన్నారు. పాచిలవానిపాలెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు ఆయన పంపిణీ చేశారు. హెచ్‌ఎం వీరాంజనేయులు పాల్గొన్నారు.

నాతవరం: మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలన్న కృత నిశ్చయంతో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఉన్నారని వైస్ ఎంపీపీ మైనం శ్రీనాగోపి తెలిపారు. చమ్మచింత పాఠశాలలో ఆయన విద్యార్థులకు విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ హెచ్‌ఎం కాశపు శివ రాంప్రసాద్, సర్పంచ్ వెలకాడ కొండబాబు, ఉప సర్పంచ్ అప్పన దివాణం పాల్గొన్నారు.

చోడవరం రూరల్: బెన్నవోలు పాఠశాల విద్యార్థులకు సర్పంచ్ మూడెడ్ల శంకరరావు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. హెచ్‌ఎం కుమారి, పేరెంట్స కమిటీ చైర్మన్ నిటా రమణబాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వీఆర్పీ పక్షపాత వైఖరికి వ్యతిరేకంగా నిరసన

రోలుగుంట: దొంగ మస్టర్లు వేసి నిధులు దుర్వినియోగంతోపాటు దురుసుగా ప్రవర్తిస్తున్న వీఆర్పీ అనంత వైఖరికి వ్యతిరేకంగా శనివారం బుచ్చింపేట గ్రామ సచివాలయం వద్ద ఉపాధి కూలీలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వీఆర్పీపై స్పందనలో ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ చేయాలని, పనిలోకి రాని వారికి మస్టర్లు వేస్తున్నారని, పనిలోకి వస్తున్న వారికి మస్టర్లు కోత విధానం విడనాడాలంటూ నినాదాలు చేశారు. అనంతరం డిజిటల్ అసిస్టెంట్ రాజుకు ఫిర్యాదు చేశారు. పులిగా త్రిమూర్తులు, ఎం.లోవలక్ష్మి, సిహెచ్.భవాని, గుడివాడ సింహాచలం పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం వేగవంతం

మాడుగుల/కె.కోటపాడు/మాకవరపాలెం/గొలుగొండ: హౌసింగ్ డే సందర్భంగా జగనన్న కాలనీల్లో అధికారులు శనివారం పరిశీలించారు. మాడుగుల మండల ప్రత్యేకాధికారి జి. ప్రభాకరరావు ఎం. కృష్ణాపురంలోనూ, కె.కోటపాడు గృహ నిర్మాణ సంస్థ ఏఈ బి.రవిబాబు వి.సంతపాలెంలోనూ, మాకవరపాలెం ఎంపీడీవో అరుణశ్రీ జి.కోడూరులోనూ, గొలుగొండ మండల ప్రత్యేకాధికారి బి. మోహన్‌రావు రావణాపల్లిలోనూ పర్యటించి ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు.

833 జీవాలకు నట్టల నివారణ మందు



తిమిరాంలో మేకలకు నట్టల నివారణ మందు వేస్తున్న పశు వైద్యాధికారి ప్రియాంక

దేవరాపల్లి: గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందు తప్పనిసరిగా వేయాలని మామిడిపల్లి పశు వైద్యాధికారి జి. ప్రియాంక సూచించారు. తిమిరాంలో శనివారం ఆమె 833 గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందు తాపించారు. గర్భంతో ఉన్న జీవాలకు ఈ మందు పట్టించొద్దని సూచించారు. సర్పంచ్ రెడ్డి సూర్యనారాయణ, వెటర్నరీ అసిస్టెంట్లు సుధారాణి, జి. ప్రసాద్ పాల్గొన్నారు.

780 గొర్రెలకు, మేకలకు..

మాడుగుల: మండలంలో జమ్మాదేవిపేట, ఒమ్మలి, తాటిపర్తి, శంకరం, ఒమ్మలి గ్రామాల్లో 250 మేకలకు, 530 గొర్రెలకు నట్టల నివారణ మందు వేశారు. ఆర్బీకేలతోపాటు పశు వైద్యశాలలో నట్టల నివారణ మందు అందుబాటులో ఉందని ఏడీ వి. చిట్టినాయుడు తెలిపారు. జేడీపేట వీఎల్వో సత్యం తదితరులు పాల్గొన్నారు.



